ఘనంగా వనమహోత్సవం


మొక్కలు నాటుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: యంనంపేట్‌లోని భూనీలా సమేత రంగనాయక స్వామి ఆలయంలో వనహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చెర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చదనాన్ని పెంపొందించడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ నిర్వహించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్లు ధనలక్ష్మి, సాయిరెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీలత బుచ్చిరెడ్డి, ఆలయ ఈఓ భాగ్యలక్ష్మి, నాయకులు రాజేష్ గౌడ్, జితేందర్ నాయక్, కేఎం రెడ్డి, మురళి, సంతోష్, తిలక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా షాపు నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి



శామీర్‌పేట్: బాణాసంచా దుకాణాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని శామీర్‌పేట సీఐ శ్రీనాథ్ తెలిపారు. దీపావళి సందర్భంగా శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బాణాసంచా దుకాణాలు నిర్వహిస్తున్న వారితో శనివారం సీఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా షాపు వద్ద నీరు, ఇసుకను అందుబాటులో ఉంచాలని, ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఈ సమావేశంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: దీపావళి పండుగను పురస్కరించుకొని తాత్కాలిక క్రాకర్ షాపుల ఏర్పాటు కోసం పోలీస్ శాఖ నుంచి తప్పనిసరి అనుమతి తీసుకోవాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పరశురాం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా షాపులు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి కోసం ఘట్‌కేసర్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు



కీసర: చీర్యాలలోని రామాలయంలో విఘ్నేశ్వర, నాగదేవత, ధ్వజస్తంభ, నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండవ రోజైన శనివారం సాముహిక హోమాలు, విగ్రహాలకు మహాస్నపనములు, పుష్పాదివాసం నిర్వహించారు. ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, జిల్లాల తిరుమల్‌రెడ్డి, రాజ్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, భక్త బృందం గ్రామస్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

7న ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనండి



సాక్షి, సిటీబ్యూరో: నగర శివారు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నవంబరు 7న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ నిర్వహించతలపెట్టిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరగనున్నట్లు మేడ్చల్-మల్కాజిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి సహాయ అధికారి ముజాహిద్ ఖాన్ తెలిపారు. ఇందులో అత్యంత వెనుకబడిన తరగతుల కులాల స్థితిగతులపై కమిషన్ బృందానికి స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఏమైనా వినతులు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపనలు ఉన్నట్లయితే వారి వాదనలను తెలుపేందుకు వ్యక్తులు గాని, నమోదిత, నమోదుకాని అసోసియేషన్ల సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ మేరకు శనివారం మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయంలో బీసీ అభివృద్ధిశాఖ జిల్లా అధికారి ఇందిరా ఆదేశాలతో అత్యంత వెనుకబడిన తరగతుల నాయకులు, ప్రతినిధులతో సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాండు వంశరాజ్ అధ్యక్షుడు చిందం, తెలంగాణ సంచార జాతుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు జెల్లి స్రవాంత్, మందుల కుల సంఘం నాయకుడు మల్లేష్, బుక్క అయ్యవార్ కుల సంఘం నాయకులు సతీష్, మధు, బుడుబుక్కల కుల సంఘం నాయకుడు శ్రీకాంత్, అత్యంత వెనుకబడిన తరగతుల కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల గదిలో గంజాయి లభ్యం



మేడ్చల్‌రూరల్: చదువుకునేందుకు వచ్చిన విద్యార్థులు ఓ గదిని అద్దెకు తీసుకుని గంజాయి వ్యాపారం నిర్వహిస్తూ పట్టుబడిన ఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. గత శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు ఎస్‌టీఎఫ్ బృందం దాడులు నిర్వహించి 1.161 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌టీఎఫ్ సీఐ సుభాస్‌చందర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు మేడ్చల్ పట్టణంలోని కేఎల్‌ఆర్ నగర్ కాలనీలో ఓ గదిని అద్దెకు తీసుకుని నివాసముంటూ నగర పరిధిలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నారు. వీరి గదిలో మరో వ్యక్తి రఘుపతితో పాటు డిగ్రీ చదివే విద్యార్థి త్రినేత్ర గదిలో కలిసి ఉంటున్నారు. రఘుపతి ఓ కంపెనీలో పనిచేస్తుండగా అదనంగా సులువుగా డబ్బులు సంపాదించేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని సీలేరు నుంచి గంజాయి తీసుకువచ్చి అమ్మకాలు జరుపుతున్నాడు. రఘుపతి తీసుకువచ్చిన గంజాయిని గదిలో ఉండే విద్యార్థులు సైతం అమ్మకాలు చేస్తుండగా వారికి కొంత డబ్బు ఇస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం కేఎల్‌ఆర్‌లోని విద్యార్థుల గదిలో దాడులు చేసిన పోలీసులకు వారి వద్ద నుంచి ఒక కేజీ 161 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విక్రయిస్తున్న రఘుపతితో పాటు విద్యార్థి త్రినేత్రను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇక నగరం నలుమూలలా పరిశ్రమలు


ఐటీ పార్కుల విస్తరణపై సర్కారు దృష్టి

- ప్రభుత్వ భూముల గుర్తింపునకు ప్రత్యేక చర్యలు
- పారిశ్రామిక వాడలపై సర్కారు ఫోకస్
- ఉపాధి అవకాశాలను కల్పించటమే లక్ష్యం

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారుల్లో పారిశ్రామిక అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వందలాది పరిశ్రమలతో వందలాది మంది నిరుద్యోగులకు, ప్రత్యక్షంగా వేలాది కుటుంబాలకు పరోక్షంగా ఉపాధి అవకాశాలను కల్పించటమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించిన సర్కారు హైదరాబాద్-వరంగల్ పారిశ్రామిక కారిడార్‌తో పాటు మహానగరం నలువైపులా పారిశ్రామిక పార్కులపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. శివారుల్లో ఇప్పటికే గ్రిడ్ పాలసీలో భాగంగా గత ప్రభుత్వం ఉప్పల్ జెన్‌ప్యాక్ వద్ద 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ పార్కుకు శ్రీకారం చుట్టింది. నగరానికి ఉత్తరాన కండ్లకోయలో గేట్‌వే ఐటీ పార్కుకు శంకుస్థాపన చేసింది. వీటిని వేగవంతం చేయడంతో పాటు నగరానికి తూర్పు దిశలో ఘట్కేసర్ మండలం మాదారంలో ఇండస్ట్రీయల్ పార్కు స్థాపనకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ప్రభుత్వ భూముల వివరాలపై సర్కారు ఆదేశాలతో అధికార యంత్రాంగం... శివారు జిల్లాల్లో గుర్తించే పనిపై నిమగ్నమైంది. ఈ నేపథ్యంలోనే రెవెన్యూ శాఖ ప్రభుత్వ భూముల గుర్తింపుపై చర్యలకు ఉపక్రమిస్తోంది.

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో...

పారిశ్రామిక పార్కుల ఏర్పాటు కోసం జాతీయ రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించటంతో పాటు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వే సౌకర్యం, నీటి సరఫరా, స్థానికులకు ఉద్యోగ అవకాశాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం అధికార యంత్రాంగానికి సూచించింది. ఆ దిశగా చర్యలకు ముందడుగు వేస్తోంది. కొండలు, గుట్టలు అటవీ భూములు కాకుండా ఇతర భూములను ఎంపిక చేయాలని కోరటంతో పాటు ప్రభుత్వ భూములు అందుబాటులో లేకుంటే ప్రైవేట్ భూములను కూడా గుర్తించి, వాటి బహిరంగ మార్కెట్ ధర, ప్రభుత్వ ధరలను తెలపాలని పేర్కొనడంతో ఆమేరకు చర్యలు చేపడుతోంది. స్థానికంగా ఉన్న వనరుల వివరాలతో పాటు ఏయే పరిశ్రమలకు సంబంధిత భూములు, ప్రాంతాలు అనువుగా ఉంటాయన్న విషయాలను నివేదికలో పొందుపరిచేందుకు సిద్ధమవుతోంది. భూములను గుర్తించిన తర్వాత ఆయా ప్రాంత చిత్రాలు (లోకేషన్ మ్యాప్‌లు) తయారు చేసి రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్‌ఐఐసీ)కి పంపించాలని నిర్దేశించడంతో అందుకు అనుగుణంగా కార్యాచరణకు వ్యూహరచన చేస్తోంది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రభుత్వ భూముల సమగ్ర సర్వేలో రెవెన్యూ యంత్రాంగం తలమునకలైనట్లు తెలుస్తోంది.



ప్రభుత్వ భూముల లెక్క ఇలా ..

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ భూముల గుర్తింపుపై ఆరా తీస్తున్న రెవెన్యూ యంత్రాంగం 12 మండలాల పరిధిలో 5,195 ఎకరాల ఉన్నట్లు రెవెన్యూ శాఖ లెక్క తేల్చినట్లు తెలుస్తోంది. ఈ ప్రభుత్వ భూముల్లో ఎన్ని భూములు కబ్జాకు గురయ్యాయి? సంరక్షణలో ఎన్ని ఉన్నాయి? అన్న అంశాలను తేల్చేందుకు సమగ్ర సర్వేకు రెవెన్యూ శాఖ శ్రీకారం చుట్టింది. మేడ్చల్ జిల్లాలో బాలానగర్ మండలంలో 700 ఎకరాలు, శామీర్‌పేట మండలంలో 420 ఎకరాలు, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 425 ఎకరాలు, మేడిపలి మండలంలో 900 ఎకరాలు, ఘట్కేసర్ మండలంలో 500 ఎకరాలు, కాప్రా మండలంలో 400 ఎకరాలు, కీసర మండలంలో 417 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలంలో 600 ఎకరాలు, బాచుపల్లి మండలంలో 360 ఎకరాలు, ఉప్పల్ మండలంలో 333.13 ఎకరాలు, మల్కాజిగిరి మండలంలో 113.06 ఎకరాలు, మేడ్చల్ మండలంలో 37 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రభుత్వ భూముల్లో దాదాపు 30 శాతానికి పైగా భూములు కబ్జాకు గురైనట్లు అంచనా వేస్తున్న రెవెన్యూ శాఖ సమగ్ర సర్వేపై దృష్టి సారిస్తోంది.

అసైన్డ్ భూములిలా ..

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో అసైన్డ్ భూముల వివరాలపై కూడా రెవెన్యూ యంత్రాంగం కన్నేసినట్లు తెలుస్తోంది. జిల్లాలో 2004 వరకు ప్రభుత్వ భూములను ఎంత మందికి అసైన్డ్ చేశారనే విషయాలపై రెవెన్యూ శాఖ ప్రత్యేక దష్టి సారిస్తోంది. మేడ్చల్ జిల్లాలో 116 గ్రామాలకు చెందిన 8, 230 మంది నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ కుటుంబాలకు 11, 384 ఎకరాల ప్రభుత్వ భూములను వ్యవసాయం (పంట సాగు), ఇళ్ల స్థలాల కోసం అసైన్డ్ చేశారని గుర్తించిన అధికార యంత్రాంగం మండలాల వారీగా సంబంధిత వివరాలపై ఆరా తీస్తోంది. అందులో భాగంగా ఘటేస్కర్ మండలంలోని 17 గ్రామాల్లో 1610 ఎకరాలు, శామీర్‌పేట మండలం 30 గ్రామాల్లో 1451 ఎకరాలు, కీసర మండలం 16 గ్రామాల్లో 1500 ఎకరాలు, మేడ్చల్ మండలం 29 గ్రామాల్లో 4400 ఎకరాలు, ఉప్పల్ మండలం 6 రెవెన్యూ గ్రామాల్లో 286 ఎకరాలు, కుత్బుల్లాపూర్ మండలం 18 గ్రామాల్లో 855 ఎకరాలు అసైన్డ్ భూములు ఉన్నట్లుగా రెవెన్యూ శాఖ గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ అసైన్డ్ భూములకు సంబంధించి నోటరీ క్రయ విక్రయాలు చాలా మేరకు జరగగా.. అనేక సంస్థలు వెలసినట్లు సమాచారం. అలాగే వందలాది ఎకరాల భూములు కూడా అన్యాక్రాంతమైనట్లు గుర్తించిన అధికార యంత్రాంగం ప్రభుత్వం సూచనలకు అనుగుణంగా చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

బీజేపీ బలోపేతానికి చర్యలు


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్


హాజరైన బీజేపీ నేతలు, నాయకులు

కీసర: మేడ్చల్ నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని మేడ్చల్-మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం కీసర ఓఆర్‌ఆర్‌సర్వీస్ రహదారిలో గల ఎమ్మెల్సీ రాంచంద్రరావు ఫామ్‌హౌస్‌లో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ అసెంబ్లీ పరిధిలో బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష దాటాలని, ఇప్పటికే 63వేల మంది బీజేపీ సభ్యత్వం తీసుకున్నారన్నారు. త్వరలో లక్ష్యానికి మించి బీజేపీ సభ్యత్వం పూర్తి చేయాలని బీజేపీ నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్ వివిధ మండల అధ్యక్షులు, కార్పొరేషన్ అధ్యక్షులు ఇతర కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న తోటకూర వజ్రేష్‌యాదవ్ తదితరులు

కీసర: మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేయడం జరుగుతుందని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 6, 16, 20 వార్డుల్లో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో మంజూరైన రూ. 38 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, మున్సిపల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి కళాశాలలో ఓరియంటేషన్ డే


కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో శనివారం ఓరియంటేషన్ డే నిర్వహించారు. కార్యక్రమంలో బిగ్‌సీ మొబైల్స్ హెచ్‌ఆర్ రాం మోహన్‌రెడ్డి, కళాశాల కార్యదర్శి త్రిహాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, పరిశ్రమ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి కృషి చేయాలన్నారు. పలు అంశాలను, వారి అనుభవాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, ట్రెజరర్ త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డైరెక్టర్ మోహన్‌బాబు, ఎంబీఏ హెచ్‌ఓడీ నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆటో డ్రైవర్లు, బీఆర్‌టీయూ నాయకులు

మేడ్చల్‌రూరల్: ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 5న బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించే ఆటో డ్రైవర్ల మహాధర్నాను విజయవంతం చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ కోరారు. ఈ మేరకు శనివారం మేడ్చల్‌లో ఆటో డ్రైవర్లతో కలిసి మహాధర్నా వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసిందని, కుటుంబాన్ని పోషించలేక డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 5న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పరమేశ్, నాయకులు వినోద్, రాజుగౌడ్, ఎల్లయ్య, శంకర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ ఫైన్ ఆర్ట్స్ కో-ఎడ్యుకేషన్ గురుకుల్ పాఠశాలలో 2024-25 సంవత్సరానికి గెస్ట్ అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మధులత ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2-5 గంటల వరకు వారంలో మూడు సార్లు విధులు నిర్వహించాలన్నారు. కూచిపూడి, కథక్, మృదంగం, తబల, తబల అసిస్టెంట్, వీణ, ఫ్లూట్, వయోలిన్, గిటార్, కీబోర్డు అంశాలు బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31 లోపు పీఆర్‌ఐ-ఆర్‌ఆర్-ఎంఎల్‌కేజీఆర్-ఎస్‌ఈబ్ల్యూఆర్‌ఎస్ తెలంగాణ జీటీపీ.ఇన్ మెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం 7995010640 నంబర్‌లో అన్ని పని దినాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు సంప్రదించాలన్నారు.

పలు ప్రాంతాల్లో పోలీసుల నాకాబందీ


పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 37 మంది పోలీసులు 5 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో మేడ్చల్ చెక్‌పోస్ట్, కిష్టాపూర్ పూడూర్, కిష్టాపూర్, చెక్‌పోస్ట్ పారిశ్రామిక ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 342 వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు సరైన పత్రాలు లేని 32 వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. తనిఖీలో మేడ్చల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ట్రస్ట్ ది మ్యాజిక్ ఆఫ్ ది బిగినింగ్ పేరిట నిర్వహించిన వర్క్‌షాప్‌లో మొదటి రోజు మానీష్ మిశ్రా రెండవ రోజు రాజేశ్‌ల ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు ఇలాంటి వర్క్‌షాప్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఎంబీఏ హెచ్‌ఓడీ, ఏవో, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


నమూనాలను తిలకిస్తున్న ఎన్‌ఐఎన్ శాస్త్రవేత్త మహేష్‌కుమార్


సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న మహేష్‌కుమార్

పోచారం: ఆధునిక సమాజంలో విద్యకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నామని జాతీయ పోషణ సంస్థ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్) శాస్త్రవేత్త డాక్టర్ మహేష్ కుమార్ ముమ్మడి అన్నారు. శనివారం యంనంపేట్‌లోని రాక్‌ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ప్రపంచ మేథో మిళిత సంభాషణ (కొలోక్వియమ్ ఫ్యూజన్ ఆఫ్ గ్లోబల్ ఇంటెలెక్ట్) పేరుతో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నేలకోత, అంతరిక్షం, స్మారక చిహ్నాలు, పక్షులు మొదలైన నమూనాలను వీక్షించి, విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీయడానికి యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు ప్రపంచ మేథస్సును పరిశోధించి, తమదైన రీతిలో నమూనాలను రూపొందించి వైవిధ్యతను చాటుకున్నారు. కార్యక్రమంలో ఫ్యూచర్ డాట్స్ కోఫౌండర్ పవన్ కుమార్, స్కూల్ చైర్మన్ మీనిగె రామన్ నాయుడు, సీఈఓ రంగినేని సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ దివ్యశర్మ, ప్రధానోపాధ్యాయురాలు శ్రీరంజని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికెన్ ప్రాసెసింగ్ యూనిట్‌కు వ్యతిరేకంగా రైతుల నిరసన


మాంసం ప్రాసెసింగ్ యూనిట్‌లో పేరుకుపోయిన చికెన్ వ్యర్థాలు

కీసర: పంట పొలాల మధ్య అక్రమంగా నిర్వహిస్తున్న మాంసం(చికెన్) ప్రాసెసింగ్ యూనిట్, దాని నుండి విడుదలవుతున్న కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కీసర రెడ్డిగూడెం, నూకలగూడెంకు చెందిన రైతులు కీసర రెడ్డిగూడెంలోని యూనిట్ వద్ద ధర్నా నిర్వహించారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి కీసర నుండి నూకలగూడెం వెళ్లే రహదారిలో ఓ పౌల్ట్రీ ఫామ్‌ను లీజుకు తీసుకుని అందులో బాయిలర్ కోళ్ల మాంసం ప్రాసెసింగ్‌ను నిర్వహిస్తున్నాడు. రాత్రి తొమ్మిది గంటల నుండి తెల్లవారుజాము వరకు చికెన్ కటింగ్ చేసి వాటి నుండి వచ్చే వ్యర్థాలను పరిసర ప్రాంతాల్లోని పొలాల్లోకి వదులుతున్నాడని రైతులు ఆరోపించారు. దీంతో దుర్వాసనతో రోగాలు ప్రబలుతున్నాయని వాపోయారు. దీనిపై యూనిట్ నిర్వాహకులను ప్రశ్నించినా ఫలితం లేదన్నారు. అనంతరం మాంసం ప్రాసెసింగ్ యూనిట్‌ను తొలగించాలని కోరుతూ దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణికి ఫిర్యాదు చేసారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ నాగమణిని వివరణ కోరగా తమ సిబ్బంది యూనిట్‌ను సందర్శించారని, త్వరలో దీనిపై చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి


గుమ్మడి విక్టర్ (ఫైల్ ఫొటో)

కీసర: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంపల్లిదాయర జాఫర్‌ఖాన్‌గూడ చెరువు వద్ద చోటు చేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాంపల్లి, ఇస్మాయిల్‌ఖాన్ గూడకు చెందిన గుమ్మడి విక్టర్(48) శనివారం ఉదయం తన మిత్రులతో కలిసి రాంపల్లిదాయరలోని జాఫర్‌ఖాన్ గూడ చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీళ్లలో పడిపోగా ఈత రానికారణంగా నీటిలో మునిగి చనిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూసీ పునరుజ్జీవనం కోసం నడుం బిగించాలి


మూసీ పునరుజ్జీవనం పాదయాత్రలో వజ్రేశ్‌యాదవ్, కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్: సీఎం రేవంత్‌రెడ్డి కోరిక మేరకు మూసీ పునర్జీవనం కోసం నడుంబిగించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. మూసీ ప్రాంత ప్రజల కోసం శనివారం నిర్వహించిన మూసీ పునరుజ్జీవనం కోసం చేపట్టిన ప్రజా చైతన్య యాత్రకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మేడ్చల్ జెడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎదులాబాద్ నుంచి పిలాయిపల్లి మక్త అనంతారం వరకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మూసీ పునరుజ్జీవనంతో రైతాంగం, కుల వత్తులకు న్యాయం జరుగుతుందని, స్థానికులకు మూసీ ద్వారా స్వచ్ఛమైన నీరు అందించడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో దయాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజ్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మశ్చేందర్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులు యాదవ్, జంగయ్యయాదవ్, మాజీ సర్పంచ్ వెంకటేష్ ముదిరాజ్, సంజీవరెడ్డి, ఫరూక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.